www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 నవంబర్ 2024
5
ఏలూరు




ఎస్ఐ అభ్యర్థులకు కొనసాగిన పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్ఐ అభ్యర్థులకు పరీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయని డిఐజి జివిజి.అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరు సమీపంలోని పెదవేగి ప్రాంతంలో ఉన్న జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎస్ఐ అభ్యర్థులకు రాత పరీక్షలు సోమవారం నిర్వహించగా, మంగళవారం ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. అలాగే మాక్ డ్రిల్ ఆయుధాల వినియోగం, నేర స్థలాలను పరిశీలించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాలను విచారించడం వంటి పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా డిఐజి అశోక్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు సివిఎ.రామకృష్ణ, సూర్యచంద్రరావు, సిహెచ్‌వి.ప్రసాదరావు, చెంచురెడ్డి, ఎన్ఎస్ఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై..
వేధింపుల పర్వం..!

- పలువురు ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిల తీరు చర్చనీయాంశం
- పనిలో టార్గెట్ల పేరుతో తీవ్ర వేధింపులు
- సస్పెండ్ చేస్తాం.. జీతాలు ఆపేస్తామంటూ బెదిరింపులు
- పని వేళలతో సంబంధం లేకుండా విధులు అప్పగింత
- తప్పులు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒలు వెన్నుదన్ను
- నిడమర్రు మండలంలో పరిస్థితి మరింత దారుణం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సచివాలయ ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. వాళ్లు తోటి ఉద్యోగులే అనే మాట పంచాయతీ కార్యదర్శులు, మండలాధికారులు మరిచిపోయి వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టార్గెట్ల పేరుతో నిత్యం రాచిరంపాన పెడుతున్నారు. పని వేళతో సంబంధం లేకుండా విధులు అప్పగిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. సెలవు దినాల్లోనూ పనులు అప్పగించి చేయకపోతే జీతాలు ఆపేస్తాం.. సస్పెండ్ చేస్తాం అంటూ బెదిరిస్తున్న పరిస్థితి నెలకొంది. పని చేయకుండా తమకు బాకా ఊదే పంచాయతీ కార్యదర్శులను వెనకేసుకొస్తూ పలువురు ఎంపిడిఒలు వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతా కలిసి సచివాలయ ఉద్యోగులపైనే పెత్తనం చేస్తూ జిల్లా ఉన్నతాధికారుల వద్ద మార్కులు కొట్టేసేందుకు మనసుపెట్టి మారేడు కాయ చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 938 గ్రామ సచివాలయాలు, 227 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 9,550 మంది వరకూ ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రజలకు దగ్గరగా సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగులే క్షేత్రస్థాయిలో పనులు నిర్వహిస్తూ అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగులపై పంచాయతీ కార్యదర్శులు, మండలాధికారులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారుతోంది. పని పేరుతో తీవ్ర వేధింపులు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. ఇటీవల జరుగుతున్న హౌస్‌హోల్డ్ సర్వేకు సంబంధించిన టార్గెట్లు విధించి నరకయాతన చూపించారు. ఇప్పుడు స్వర్ణ పంచాయతీ పేరుతో పంచాయతీలోని పనులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పని చేయడానికి తమకు ఇబ్బంది లేదని, పంచాయతీ, మండలాధికారులు సచివాలయ ఉద్యోగులను పురుగుల కంటే హీనంగా చూస్తుండటం తీవ్ర బాధ కల్గిస్తోందని వాపోతున్నారు. గతంలో వాలంటీర్లు చేసే పింఛన్ల పంపిణీ, సర్వేలు వంటి పనులన్నీ ఇప్పుడు సచివాలయ ఉద్యోగులే చేస్తున్నారు. అయినప్పటికీ పలువురు మండలాధికారులు మాత్రం సచివాలయ ఉద్యోగుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. ఆరోగ్యం బాగోలేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల పట్ల మానవత్వం మరిచి సెలవు పెట్టడానికి వీలులేదని, పని చేయాల్సిందేనని హింసిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం స్వర్ణ పంచాయతీ పేరుతో పన్నులకు సంబంధించి ఆన్‌లైన్ జరుగుతోంది. ఒక గ్రామంలో వెయ్యి ఇళ్లు దాటితే డిజిటల్ అసిస్టెంట్‌తోపాటు మరొక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకుని పని చేయించాల్సి ఉంది. అలాకాకుండా సచివాలయ ఉద్యోగులందరూ చేయాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల పని వేళలు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ. అయితే ఎనిమిది గంటలకే రావాలని కొంతమంది, పదిలోపే బయోమెట్రిక్ వేయాలంటూ సచివాలయ ఉద్యోగులను నిత్యం వేధిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. సాయంత్రం ఐదు గంటలకు వెళ్లాల్సి ఉండగా, 5.30 గంటల తర్వాత బయోమెట్రిక్ వేయాలని ఆంక్షలు పెడుతున్నారు. వెళ్లిపోయే ముందు పనులు అప్పగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లేదంటే జీతం ఆపేస్తామంటూ పలువురు పంచాయతీ కార్యదర్శులు బెదిరిస్తున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత సైతం పని చేయాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నిడమర్రు మండలంలో పరిస్థితి దారుణం

సచివాలయ ఉద్యోగుల విషయంలో నిడమర్రు మండలంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నట్లు చర్చ సాగుతోంది. పని చేయని పలువురు పంచాయతీ కార్యదర్శులను వెనకేసుకొస్తూ మండలాధికారులు సచివాలయ ఉద్యోగులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని మందలపర్రు పంచాయతీ కార్యదర్శి సమయానికి విధులకు రాకపోయినా, రికార్డు సక్రమంగా నిర్వహించకపోయినా ఆయన్ని వెనకేసుకొస్తూ మండలాధికారులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీలోనూ చాలామంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొనడం లేదు. అయినప్పటికీ వారి గురించి మండలాధికారులు పట్టించుకోవడం లేదు. తమకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులను పింఛన్ల పంపిణీ నుంచి కార్యదర్శులు మినహాయిస్తున్నా అధికారులకు పట్టని పరిస్థితి. మందలపర్రు పంచాయతీలోని సమస్యలపై ఇటీవల పత్రికల్లో వచ్చిన అంశాలపై మండలాధికారులు విచారణ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గడిచిన నాలుగు నెలలుగా హాజరు పట్టికలో సంతకాలు పెట్టకపోయినా, అప్పటికప్పుడు పెట్టించి ఆయన్ని కాపాడినట్లు తెలుస్తోంది. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోయినా పట్టించుకోని పరిస్థితి ఉందని సమాచారం. సదరు కార్యదర్శి తీరుతో ప్రజాప్రతినిధులుసైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మండలాధికారులకు పట్టడం లేదని చెబుతున్నారు. సదరు కార్యదర్శి ఉద్యోగులతో ఘర్షణ పడుతున్నా వెనకేసుకొస్తున్న పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. ఈ మండలంలో సచివాలయ ఉద్యోగులను పురుగుల కంటే హీనంగా చూస్తున్నారనే చర్చ ఉద్యోగుల్లో సాగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని అధికారులు బయోమెట్రిక్ హాజరు వేయకపోయినా పట్టించుకోవడం లేదని, సచివాలయ ఉద్యోగులను మాత్రం వేధిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు అక్కడి పరిస్థితులపై దృష్టి సారిస్తేనే అసలు విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంటుంది. పనులు చేసే ఉద్యోగుల పట్ల అధికారులు ఈవిధంగా వ్యవహరించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది.


కలెక్టరేట్ వద్ద మహాధర్నా

మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ
కదంతొక్కిన రైతులు, కార్మికులు

జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా- కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు ఏలూరు కలెక్టరేట్ వద్ద కదం తొక్కారు. తొలుత స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పులు, కళాకారుల నృత్యాలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.సోమశేఖర్ అధ్యక్షత వహించారు. సభలో ఎఐటి యుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి. ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఎస్.రామ్మో హన్, ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటే శ్వరరావు, రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కె.భాషా, అఖిల భారత ప్రగతిశీల రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.గౌస్, ఎఐకె ఎంఎస్ రాష్ట్ర నాయకులు పోరండ్ల శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, ఎబిఎం రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల పరం చేయడం తగదన్నారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం, రైతురుణ విమోచన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. అటవీ హక్కుల చట్ట సవరణ రద్దు చేయాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఆందోళనకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైత న్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ధర్మల సురేష్, సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ జిల్లా కార్యద ర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు మద్దతు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కార్మికులు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, గిరిజ నులు జిల్లా నలుమూలల నుండి తరలొచ్చి పాల్గొన్నా రు. వివిధ సంఘాల నేతలు బి.సోమయ్య, నారపల్లి రమణారావు, వివిఎన్.ప్రసాద్, సిహెచ్.సుందరయ్య, కె.విజయలక్ష్మి, ఎస్‌కె.సుభాషిణి, ఎస్.రాంబాబు, జె.గోపీ, టి.మాణిక్యం, లోకేశ్వరి, జాన్‌బాబు, ఎం.జీవర త్నం, తామా ముత్యాలమ్మ, రెడ్డి శ్రీనివాస్ డాంగే, పి.కన్నబాబు, కుంచే వసంతరావు, గొలిమే బాలయేసు, కె.కృష్ణమాచార్యులు, ఉప్పులూరి హేమశంకర్, పి.లత, బాబూరావు, బద్దా వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు, కాకి నాని, బాసినేని సత్యనారాయణ, గడ్డల ముత్యాలరావు, కె.వీరాస్వామి, సోయం చంద్రరావు, కె.ముత్యాలరావు, ఎస్‌కె.మున్నీ, కుంజం రామారావు, కలింపూడి సుందర్రావు, కట్టా భాస్కరరావు, గుత్తికొండ వెంకటకృష్ణారావు, కొర్ని అప్పారావు, పిచ్చుక ఆది శేషు, కడుపు కన్నయ్య పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలి

- ఉద్యోగులు రాజ్యాంగ స్ఫూర్తితో పని చేయాలి
- కలెక్టర్ కె.వెట్రిసెల్వి
- ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు కలెక్టరేట్‌లో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరించి అధికారులు, సిబ్బందిచే భారత రాజ్యాంగం పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగంలో పొందుపర్చిని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యభావాలకు అనుగుణంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి దిక్సూచిగా అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం నిలుస్తుందన్నారు. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులతోపాటు విధులు, బాధ్యతలు కూడా ప్రజలు గుర్తెరిగి రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా తమ విధులు రాజ్యాంగబద్ధంగా సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి వి.జయప్రకాష్, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్.నాగరాణి, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, డిసిపిఒ సిహెచ్.సూర్యచక్రవేణి, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, డిఎల్‌డిఒ లక్ష్మి తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు స్పోర్ట్స్: ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రూపొందించిన ఘనత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు దక్కుతుందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాల యంలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దేశం ఏక మార్గంలో నడిచేందుకు, తారతమ్యాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కులాలు, మతాల పేరిట కొట్లాటలు లేకుండా సమాజం ఏకతాటిపై నడిచే విధంగా మనం కూడా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

బకాయి వేతనాలివ్వాలని శానిటేషన్ వర్కర్ల ధర్నా


ధర్నానుద్దేశించి మాట్లాడుతన్న సోమయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే శానిటేషన్ వర్కర్స్ 1900 మందికి రావాల్సిన ఐదు నెలల బకాయి జీతాలు రూ.7.50 కోట్లు వెంటనే ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.దుర్గ అధ్యక్షత వహించారు. కార్యక్రమా న్నుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లు ఐదు నెలలుగా జీతాల్లేక ఆకలితో అలమటిస్తున్నారని, ప్రభుత్వాధికా రులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చోద్యం చూస్తున్నారు తప్ప, సమస్య పరిష్కరించడం లేదని విమర్శించారు. నెలాఖరులోపు జీతాలు చెల్లించని పక్షంలో డిసెంబరు ఒకటో తేదీ నుండి పనులు నిలుపుదల చేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా కార్యదర్శి కె.విజయలక్ష్మి, నాయకులు పూజిత, అనిత, కృష్ణవేణి, రవణమ్మ, జమీల, సూర్యకుమారి, స్వప్న, లీలావతి, లక్ష్మీ బాలాజీ, సాబేర నాయకత్వం వహించారు.

విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు


పరుగు పందెం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వచ్చే నెల మూడో తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సెట్‌వెల్ సిఇఒ కెవిఎస్.ప్రభాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల్లో మొత్తం 16 క్రీడాంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో 300 మంది విభిన్న ప్రతిభావంతులు పాల్గొంటున్నారని, స్త్రీ, పురుషులకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. రన్నింగ్, షాట్ పుట్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, ట్రై సైకిల్, సాఫ్ట్‌బాల్, బ్లైండ్ క్రికెట్, క్యారమ్స్, చెస్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు వచ్చే నెల మూడో తేదీన బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శాఖ సూపరింటెండెంట్ కిషోర్, వివిధ ఆర్గనైజేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - పోలవరం


ప్రపంచంలో అత్యున్నత పెద్ద రాజ్యాంగం భారత రాజ్యాంగం అని, దీన్ని ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్ అన్నారు. భారత రాజ్యాంగానికి ఆమోదం తెలిపిన రోజు సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అనంతరం సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్, పోలవరం నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదం వాటిల్లిందన్నారు. మోడీ ఇప్పటికైనా ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలన్నీ రద్దు చేయాలన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీల భారం ఉపసంహరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొరగం భూచంద్రరావు, ఎస్.సాయికృష్ణ, టి.శాంతి, వీరాయమ్మ, గోకూరి రామకృష్ణ, ముత్యాలమ్మ, సున్నం కన్నయ్య పాల్గొన్నారు.

ప్లాంటేషన్‌లో కలప తరలిస్తే కఠిన చర్యలు

ఎపిఎఫ్‌డిసి జిల్లా మేనేజర్ పుష్ప సౌజన్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కార్పొరేషన్ ప్లాంటేషన్లలోని కలపను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ అభివృద్ధి కార్పొరేషన్ జిల్లా మేనేజర్ జె.పుష్పసౌజన్య హెచ్చరించారు. మంగళవారం దర్భగూడెం బీట్ పరిధిలో ఉన్న కార్పొరేషన్ జామాయిల్ ప్లాంటేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల ఓ కాంట్రాక్టర్‌కు జామాయిల్ కటింగ్ కాంట్రాక్టు పనులు అప్పగించినట్లు తెలిపారు. కటింగ్ పూర్తయిన అనంతరం సన్నపుల్లను తరలించేందుకు అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. అయితే సన్నపుల్లతోపాటు జామాయిల్ దుంగలను కూడ తరలిస్తున్నట్లు ఫిర్యాదురాగా ప్లాంట్ మేనేజర్ విచారణ చేసినట్లు చెప్పారు. ఈ విచారణలో పలు దుంగలను తరలించినట్లు గుర్తించామని, దీనిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయనున్నట్లు, సిబ్బంది హస్తం ఉందని రుజువైతే వారిపైనా చర్యలు తీసుకోనున్నట్లు సౌజన్య తెలిపారు. ఆమె వెంట ప్లాంట్ మేనేజర్‌లు వసంత, చిన్న పాపయ్య, డిపిఎంలు రామాంజనేయులు, రెహ్మాన్, బీట్ అధికారులు లలిత, వాచర్లు ఉన్నారు.


పరిశీలిస్తున్న పుష్ప సౌజన్య

ముద్రబోయినను పార్టీ నుండి సస్పెండ్ చేయాలి

టిడిపి నేత కాపా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


టిడిపి అప్రతిష్ట పాల్జేస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్రబోయిన వెంకటేశ్వరరావును పార్టీ నుండి సస్పెండ్ చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, రావిచర్ల గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ రావిచర్లలో అక్రమ క్వారీయింగ్ జరుగుతోందని ముద్రబోయిన ఆరోపించడం దారుణమన్నారు. ప్రజల అవసరాల కోసం మట్టిని తవ్వి వినియోగిస్తుంటే ఎందుకు ఆక్రోశమని ప్రశ్నించారు. గన్నవరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ముద్రబోయిన మట్టి స్కామ్ చేసిన సంగతి అందరికీ తెలుసని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజలకు ఉచిత ఇసుకతోపాటు ఉచితంగా మట్టి అందించే కార్యక్రమం కచ్చితంగా అవసరమని అన్నారు. ఇంటి నిర్మాణం, లేఅవుట్ల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి తదితర కార్యక్రమాలకు మట్టి ఎంతో అవసరమన్నారు. డబ్బు ఉన్నప్పటికీ మట్టి లేక చాలా కార్యక్రమాలు నిలిచిపోతున్నాయని వివరించారు. మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర టిడిపి నేతలకు అందుబాటులో లేకుండా, మద్దతు పలకకుండా ఉంటున్న ముద్రబోయిన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. లావు ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు మాట్లాడకపోయినా సొంత పార్టీలో ఉన్న ముద్రబోయిన ప్రతిపక్షం కంటే దారుణంగా మాట్లాడి పార్టీ పరువు, ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముద్రబోయినపై అధిష్టానం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీజీసెట్ రాయకున్నా ఎంకామ్‌లో చేరొచ్చు

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీజీ కోర్సెస్ ఎంకామ్ (కామర్స్)లో చేరాలనుకున్న అభ్యర్థులు కళాశాలకు నేరుగా వచ్చి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. 2024 పీజీ సెట్‌కు హాజరు కాకపోయినప్పటికీ డైరెక్ట్ స్పాట్ అడ్మిషన్ ద్వారా ఎంకామ్‌లో చేరవచ్చన్నారు. వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని పేర్కొన్నారు.

ఆ గ్యాస్ కనెక్షన్లు రద్దు చేసి కొత్తవి ఇవ్వండి

సిపిఎం ఆధ్వర్యాన వినతి


వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు

గిరిజన సొసైటీలో తీసుకున్న గ్యాస్ కనెక్షన్లు రద్దు చేసి కొత్త కనెక్షన్లు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి బియ్యన శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన కొత్త గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అమర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ కుక్కునూరు మండలంలో గిరిజన ప్రైమరీ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా దీపం పథకం కింద ఇండియన్ గ్యాస్ అనుబంధంతో 2016లో కొత్త కనెక్షన్లు జిసిసి అధికారులు ఇచ్చారు. అట్టి కనెక్షన్ నుండి సిలెండర్ తీసుకోవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలెండర్ తీసుకోడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2016లో తీసుకున్న కనెక్షన్లు రద్దు చేసి వాటి స్థానంలో కుక్కునూరు హెచ్‌పి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు యర్నం సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, పులదాసు రమేష్ పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చాట్రాయి

వచ్చే నెల 13, 14, 15 తేదీల్లో జరిగే 26వ సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీమేరీ ఇంటి వద్ద మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 26వ జిల్లా మహాసభ బుట్టాయగూడెంలో మూడు రోజుల పాటు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు చాగంటి రాజారావు, సిఐటియు మండల కార్యదర్శి టిఎస్ఎం.సూరి, పార్టీ బాధ్యులు ఏకశిరి నాగేశ్వరరావు, గొల్లమూడి రంగారావు పాల్గొన్నారు.

'గౌతమి' కార్మికుల ఆందోళనకు సిఐటియు మద్దతు


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జీతాల పెంపుదల కోసం గౌతమి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్మికులు చేపట్టిన ఆందోళనకు సిఐటియు జిల్లా కమిటీ పూర్తి మద్దతు తెలియజేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గౌతమి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికుల జీతాల పెంపుదల, ఇతర న్యాయమైన కోరికలను పరిష్కరించాలని తెలిపారు. వారి ఆందోళనకు కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గొల్లగూడెం ఆంజనేయ స్వామి ఆలయ వీధిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ నిత్యం ప్రమాదకరంగా ఉంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సిఐటియు నాయకుడు నక్కా సుబ్బారావు, నక్కా మధన్‌మోహన్ విమర్శించారు. ఇంటి సర్వీసు, వీధి దీపాల కోసం వినియోగించే స్తంభాల నుంచి తీగలు వదులై కిందకు వేలాడు ఇంటి గుమ్మం, మెట్లను తాకుతున్నాయని, గతంలో రెండుసార్లు తృటిలో విద్యుదాఘాతం నుంచి ప్రాణాలతో బయటపడ్డామని బాధితులు వాపోతున్నారు. దీనిపై గత నెలలో మీకోసంలో ఫిర్యాదు చేసినా కనీసం సంబంధిత అధికారులు స్పందించలేదని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సుబ్బారావు, మధన్ మోహన్ ప్రశ్నించారు. గొల్లగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ టి.వేణును వివరణ కోరగా ఫిర్యాదుదారులు ఇంటిని ఎత్తుగా కట్టుకోవడం వల్ల తీగలు తగులుతున్నాయని, కాంట్రాక్టరుతో మాట్లాడి మధ్యలో స్తంభం వేయించి తీగలను టైట్ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


విద్యుత్ తీగలను చూపుతున్న సుబ్బారావు

మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ మినీ వర్కర్ల సమావేశం బాడీస సుజాత అధ్యక్షతన సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ పేద గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ నిరంతరం విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలు చాలీచాలని జీతాలు, పని ఒత్తిడితో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జనాభతో సంబంధం లేకుండా మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అంగన్‌వాడీ సెంటర్లకు గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి పాముల అన్నపూర్ణ, అంగన్వాడీలు మంగ, భవాని, వందన, నాగమణి, సుజాత, పున్నమ్మ, రాధ పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

టిడిపి కైకలూరు నియోజకవర్గ కో కన్వీనర్, ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్

ప్రజాశక్తి - ముదినేపల్లి



తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడే వారికే నామినేటెడ్ పదవులు వచ్చాయని టిడిపి కైకలూరు నియోజకవర్గ కో కన్వీనర్, ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తొలత మూడు గ్రామాలకు యూనిట్ సభ్యుడిగా తాను సమర్థవంతంగా పనిచేయడంతో ఎన్నికల్లో నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్‌గా పని పనిచేసే అవకాశం వచ్చిందన్నారు. దీంతో పార్టీ గెలుపు కోసం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించానన్నారు. ప్రస్తుతం కైకలూరు నియోజకవర్గ కో కన్వీనర్‌గా పని చేస్తున్నానన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. పార్టీ స్థాపించిన గత 43 ఏళ్లలో ఇదివరకెన్నడూ లేనివిధంగా ఈ సభ్యత్వ నమోదులో అరకోటిపైగానే సభ్యత్వం పూర్తయిందన్నారు. కోటి సభ్యత్వ నమోదు చేరుకుంటుందన్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం కైకలూరు నియోజకవర్గం 55 వేల సభ్యత్వ నమోదు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 32 వేల సభ్యత్వ నమోదు పూర్తయి మిగతా నియోజకవర్గాల్లో కన్న ముందంజలో ఉన్నారన్నారు. వంద రూపాయలు సభ్యత్వంతో గతంలో రూ.రెండు లక్షలు ఉన్న ప్రమాద బీమా ప్రస్తుతం రూ.ఐదు లక్షలకు పెంచడం మంచి పరిణామమన్నారు. రిపబ్లిక్ సిస్టంలో కష్టపడిన కార్యకర్తను నేరుగా గుర్తించి విధానం అమల్లోకి తేవడంతో క్యాడర్ ఉత్సాహంగా పనిచేస్తుందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బూత్ స్థాయిలో కూడా కార్యకర్తలు చేసిన ప్రతి పని కేంద్ర కార్యాలయంలో నిక్షిప్తమవుతుందన్నారు. ఏ పదవుకైనా అభ్యర్థులను ఎంపికచేసే సమయంలో సిఫారసులకు పనిలేకుండా నేరుగా గుర్తించి పదవులిచ్చే విధానం అమల్లోకి వచ్చిందన్నారు. ఇదేవిధంగా గతంలో చేసిన నామినేటెడ్ పదవుల నియామకాల్లోనూ ఇదే విధానం అనుసరించారన్నారు. ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఆ విధానంలో వచ్చిందన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం అంకితభావంతో పని చేస్తానని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు గాయాలపాలయ్యారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సుబ్బంపేట చెందిన కొండపల్లి నరేష్, అతని స్నేహితుడు పగడం ప్రవీణ్ ఈ నెల 24వ తేదీన జంగారెడ్డిగూడెం ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి టి.నరసాపురం మీదుగా చింతలపూడి బయలుదేరారు. ఈ క్రమంలో స్థానిక హైస్కూల్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. వారిని బంధువులు చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి విజయవాడ తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొలెరో వాహనం ఢీకొని...

ముదినేపల్లి : బొలెరో వాహనం ఢీకొని యువకుడు గాయాలపాలైన సంఘటన మండలంలోని సింగరాయపాలెం గ్రావెల్ ఫ్యాక్టరీ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లి మండలంలోని కొరగుంటపాలెం చెందిన యువకుడు చల్లా దైవక్రాంత్ కుమార్ సింగరాయపాలెం పనిపై వెళ్లి తిరిగి బైక్‌పై ముదినేపల్లి బయలుదేరాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దైవక్రాంత్ కుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అతడిని గుడివాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని నామవరం శివారు అటవీ ప్రాంతంలో నాటు సారా స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. టి.నరసాపురం మండలంలోని మక్కినవారిగూడెంలో వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

అన్నదాతకు అష్టకష్టాలు..!

వేధిస్తున్న గోనెసంచుల కొరత
తేమశాతం పేరుతో ఆలస్యం
కల్లాల్లోనే ధాన్యం
వాతావరణ మార్పులతో ఆందోళన
దళారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు


కల్లాల్లో ఉన్న ధాన్యం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలంలో రైతులకు గోనెసంచుల సమస్య పరిష్కారం కావడంలేదు. గోనెసంచుల కొరత వేధిస్తోనే ఉంటుంది. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించినా కింది స్థాయిలో మార్పు రావడం లేదు. గోనె సంచులు సకాలంలో ఆర్‌బికెల వద్ద ఉంచాలని అధికారులు చెప్పినా కింది స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గోనెసంచుల కొరత తప్పడం లేదు. మండలానికి వచ్చిన 1.66 లక్షల గోనెసంచులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులకిచ్చారనుకుంటే అందుకు సంబంధించి మిల్లుల్లో కనిపించడంలేదు. జాయింట్ కలెక్టర్ చింతలపూడిలో రైస్ మిల్లులు ఆకస్మికంగా తనిఖీలు చేసినప్పుడు అధికారులను అడిగితే వారు సమాధానం చెప్పలేని పరిస్థితి. గోనెసంచులు దళారుల చేతిలోకి వెళ్లాయ్యా.. మిల్లర్ల వద్దకు వెళ్లాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గోనెసంచుల కొరతతో సమ్మెటవారిగూడెం, పోతునూరు గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం విక్రయించడానికి గోనెసంచులు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఒకపక్క వాతావరణంలో మార్పులు, తుఫాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్తే గోనెసంచులు లేవని వెనక్కి పంపిస్తున్నారని వాపోతున్నారు. ధాన్యం పొలాల్లో కల్లాల్లో ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. కొంతమంది రైతులు కల్లాల్లో ధాన్యం ఆరబెట్టుకుని ఉండగా తేమ శాతం పేరుతో, గోనెసంచుల కొరతతో ఆ ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచుతున్నారు. తేమశాతం సరిపోయినా గోనెసంచుల కోసం రెండు రోజుల సమయం పడుతుందని, ముందుగా తేమశాతం తీసిన వారికి ఇవ్వాలని, క్యూ పద్ధతిలో ఇస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులను బట్టి వర్షం వస్తే దళారులకు రూ.1650 ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. రూ.1650కి దళారులు కొన్నా మిల్లర్లు తేమశాతం పేరుతో బస్తాకు రూ.వంద తగ్గిస్తామని చెప్పడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి రైతుల్లో నెలకొంది. హడావుడిగా వచ్చిన సంచులు నాణ్యంగా లేకపోవడంతో రంధ్రాలు పడి ధాన్యం పోతుందని చెబుతున్నారు.

రాఘవాపురం ఆర్‌బికె నుంచి దగ్గరలో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న రైస్ మిల్లుకు ధాన్యం విక్రయించకుండా ఏలూరులో ఉన్న రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి అదనంగా రూ.పది వేల భారం పడుతుంది. రాఘవపురం ఆర్‌బికె నుంచి మాత్రమే ఏలూరు మిల్లులకు ఎందుకు ధాన్యం తరలిస్తున్నారనేది అర్థం కాని విషయంగా ఉంది. రాఘవపురం ఆర్‌బికె నుంచి ఇప్పటివరకు 60 లారీల ధాన్యం లోడు వెళ్లగా, 40 లారీలు ఏలూరు మిల్లులకు మాత్రమే తరలివెళ్లాయి.

ఆర్‌బికెల వద్ద లేని హమాలీలు

కల్లాల్లో ధాన్యం లోడు చేయడానికి ఆర్‌బికెల వద్ద హమాలీలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. హమాలీలను రైతులే తెచ్చుకోవాలని ఆర్‌బికె వారు చెబుతున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులు హమాలీలకు కూలీలు ఇచ్చుకోలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో తక్కువ ధరకే రైతులు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దళారుల వద్ద హమాలీలు ఉండడం, గోనెసంచులు కూడా సకాలంలో అందించడంతో, వాతావరణంలో వచ్చే మార్పుల నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మడానికి సిద్ధపడుతున్నారు. ప్రభుత్వం ముందుగానే ఇ-క్రాప్ నమోదు చేయించినా ధాన్యం దిగుబడి ఎంత వస్తుంది? రైతులకు గోనెసంచులు ఎన్ని కావాలి? అధికారుల వద్ద ముందుగా డేటా ఉన్నా ఎందుకు గోనె సంచులు సకాలంలో అదించడంలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

తేమ శాతం పేరుతో ఆలస్యం చేస్తున్నారు
సంకు కోటేశ్వరరావు, రైతు

నాలుగు రోజుల క్రితం వరి పంట కోయించాను. మూడు రోజులుగా కల్లాల్లో ధాన్యాన్ని ఆరబెట్టాను. తేమ శాతం పేరుతో అధికారులు ఆలస్యం చేస్తున్నారు. గోనెసంచులు రావడానికి ఇంకా రెండు రోజుల సమయం పడుతుందని అధికారులు చెప్పారు. వర్షం వస్తే తక్కువ రేటుకు అయినా దళారులకు అమ్ముకుంటాను.

గోనెసంచులు ఇస్తే బాధలు తీరుతాయి
సూరిబాబు, రైతు

స్వర్ణరకం పంట వేశాను. పంట కోసి ఆరబెట్టి నాలుగు రోజులవుతుంది. తేమ శాతం పేరుతో అధికారులు ఆలస్యం చేస్తున్నారు. గోనెసంచుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గోనెసంచులు ఇస్తే మా బాధలు తీరుతాయి. ఆ మేరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

ఎస్ఐ కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఎస్ఐ నరసింహారావు కుటుంబానికి రూ.లక్ష చెక్కును ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మంగళవారం అందించారు. నగరంలోని సిసిఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తూ అనారోగ్య కారణాలతో గత కొంతకాలం క్రితం డి.నరసింహామూర్తి మృతి చెందారు. పోలీసు శాఖ నుంచి ఆయనకు రావాల్సిన నిధుల నుంచి రూ.లక్ష చెక్కును జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని టిడిపి మండలాధ్యక్షులు అమరవరపు అశోక్ అధికారులను కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, స్పెషల్ డిప్యూటీ స్పీకర్ ముక్కంటి కలిసి భూ సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవరపు అశోక్ అధికారులను కలిసి పోలవరం నిర్వాసితుల సమస్యలను వివరించారు. వారి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.

'అపార్' నమోదు వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులకు ప్రత్యేకించిన అపార్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంఇఒ భాస్కర్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు భీమడోలు హైస్కూల్లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి మంగళవారం సందర్శించారు. కార్యక్రమం వేగవంతంగా కొనసాగేందుకు విద్యాధికారికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అపార్ నమోదు కార్యక్రమం వేగవంతం చేసేందుకు మండలంలో మూడు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు హైస్కూల్‌తో పాటు, గుండుగొలను హైస్కూలు, భీమడోలు బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద కేంద్రాలు ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులకు కేంద్రాల సిబ్బందితో పాటు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ వంతు సహకారాన్ని అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అహ్మద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చింతలవల్లి గ్రామంలోని ఒరిగిన విద్యుత్ స్తంభం, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని సిఎస్ఐ స్కూల్ పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పిల్లి నాగేంద్రబాబు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చూడాలని ఆలిండియా దళిత రైట్స్ ఫోరం నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు ప్రత్తిపాటి వరకిషోర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వరకిషోర్ మాట్లాడుతూ చింతలవల్లి సిఎస్ఐ చర్చి వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని ఎలాంటి ప్రమాదం జరగక ముందే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే ప్రదేశంలో నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ట్రాన్స్ కో ఇన్‌ఛార్జి ఎఇ వీరబాబును కోరారు. చాలాకాలంగా నెలకొన్న డ్రెయినేజీ సమస్యపై స్థానిక సర్పంచి పిల్లి సత్యనారాయణతో వరకిషోర్ మాట్లాడగా వారం రోజుల్లో డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఆలిండియా దళిత రైట్స్ ఫోరం నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు ప్రత్తిపాటి వరకిషోర్ హెచ్చరించారు.

రాజ్యాంగంపై అందరికీ అవగాహన అవసరం

ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాజ్యాంగం గురించి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవశ్యకత ఉందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కాలేజీలో మంగళవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ భారత పౌరులు స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వంతో జీవించాలనే ఉద్దేశంతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. నేటి సమాజంలో వరకట్న దురాచారాన్ని రూపుమాపాల్సిన అవశ్యకత ఉందన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడారు. వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందించారు.

ఏలూరు : భారత రాజ్యాంగంలోని విషయాలను విద్యార్థులందరూ తెలుసుకోవాలని, చదవాలని రిటైర్డ్ జిల్లా జడ్జి అడబాల లక్ష్మి అన్నారు. తెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన సభకు సిస్టర్ మెర్సి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అడబాల లక్ష్మి, డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, డి.శివప్రసాద్ హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి అడబాల లక్ష్మి, డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సి పూలమాలలు వేశారు. కాలేజీలో రాజ్యాంగంపై వంద ప్రశ్నల్లో 25 ప్రశ్నలకు ఏర్పాటు చేసిన పోటీ పరీక్షల్లో పాల్గొన్న వారికి, ఐదుగురు విజేతలకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, భారత బచావో, బోఫ్ సంఘాల తరపున రాజ్యాంగ సంకలన పుస్తకాలు, ప్రశంస పత్రాలు అందించారు.

భారత రాజ్యాంగంపై వంద ప్రశ్నలు చదివి 25 ప్రశ్నలపై పరీక్షల్లో పాల్గొన్న 149 మంది సిఆర్.రెడ్డి పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులను ఎవిఆర్.విజ్ఞానకేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అభినందించారు. పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ సభలో అతిథులుగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నరసింహారావు, బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఎస్.కస్తూరిరావ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని బి.అలేఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

భారత రాజ్యాంగం ముసాయిదాను తయారు చేయడంలో జరిగిన కృషిని ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పివి.రమణ, ఎస్.రవి అన్నారు. స్థానిక పిడిబిటి కళాశాలలో జరిగిన సభకు లెక్చరర్ ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు.

చాట్రాయి : మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు మాట్లాడారు. బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమడోలు : మండలంలోని వివిధ ప్రాంతాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం, భీమడోలు హైస్కూల్, భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, ఇతర ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. అతిథులుగా ఎంఇఒ భాస్కర్‌కుమార్, పంచాయతీ విస్తరణాధికారి సుందరి హాజరయ్యారు.

చింతలపూడి : చింతలపూడి పాత బస్టాండ్, ఫైర్‌స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయం, బోయగూడెంలో బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పులమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా దళిత సీనియర్ నాయకులు కల్వకుర్తి నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజారత్నం, మద్దా ఆనంద్, లంకపల్లి భానుకుమార్, బోడా అనీష్, నత్తా రవికుమార్, బందెల ముత్తేశ్వరరావు, శానంపూడి కాంతారావు, నిమ్మగడ్డ అశోక్, జుపుడి వసంత్, కొవ్వూరు వెంకటేశ్వరరావు, కొవ్వూరు వెంకన్న పాల్గొన్నారు. చిత్రపురి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముసునూరు : మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.రాజకుమార్, ఎంపిడిఒ జి.రాణి, ఎస్ఐ ఎం.చిరంజీవి పాల్గొన్నారు.



ముదినేపల్లిలో...

ముదినేపల్లి : స్థానిక స్పామ్ ఐటిఐలో నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ స్ఫూర్తిని చాటుతూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఒ రామకృష్ణ హాజరయ్యారు. కాలేజీ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ మాట్లాడారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.హరిత, అధ్యాపకులు ఒ.మణి భీమరాజు, బి.కృష్ణ మోహన్, వివివి.దుర్గ, విఎస్‌వి.శివ, నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్లు జగదీష్, ప్రసన్న, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరులోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్‌రావు, బిసి జిల్లా నాయకుడు బత్తెన కిషోర్, ఎస్‌సి రాష్ట్ర కార్యదర్శి మున్నాల జాన్ గురునాథం పాల్గొన్నారు.

మండవల్లి : అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు, ఉపాధ్యక్షులు అభిష, గాంధీ అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతరాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయ్, నాగయ్య, సురేష్, కమిటీ సభ్యులు వరప్రసాద్, రాజేష్ బాబు, గుడివాడ బాలాజీ, జావాది వెంకటేశ్వరరావు, రాజు, గిరి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండలంలోని గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు పి.రాధికా రాణి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జల్లు లక్ష్మి, మల్లేశ్వరి, విఠల్‌బాబు, మోహన్‌రావు, సాకా రవి, బాలు, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, మనోహరం, విజయలక్ష్మి, నాన్ టీచింగ్ సిబ్బంది వరలక్ష్మి, రంగారావు, శిరీష, నారాయణ, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు పూలమాలలు వేశారు. అనంతరం నమూనా ఎన్నికలను ఆరు, ఏడు తరగతుల విద్యార్థులచే నిర్వహించారు. భారత రాజ్యాంగంపై విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పాడిన దేశభక్తి గీతాలు అందరిని అలరించాయి. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు సుభాషిని, దుర్గారావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం క్రాంతి నికేతన్, స్థానిక విజన్ యుపి స్కూల్, శ్రీ సాయి సూర్య హైస్కూల్, కామవరపుకోట మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అరసం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎస్.సాగర్ ఆయా పాఠశాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థుల చేత రాజ్యాంగ పీఠికను చదివించారు. ఈ కార్యక్రమంలో విజన్ యుపి స్కూల్ కరెస్పాండంట్ పురం శ్రీనివాస్, శ్రీ సాయిసూర్య హైస్కూల్ కరెస్పాండంట్ కంచర్ల పవన్‌కుమార్, వివిధ పాఠశాలల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి నారాయణపురంలో సర్పంచి అలకనంద ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు రాజ్యాంగంపై నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వరరావు, హౌసింగ్ ఎఇ చింతలపూడి సతీష్, అధ్యాపకులు రెడ్డియ్య, కొండా రవి పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని చిన తాడినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర దినోత్సవం, భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు సుమారు వంద ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు అడపా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పి.దామోదరం, జి.మాల్యాద్రి, సర్పంచి గండికోట ఏసుబాబు, మాజీ సర్పంచి యాళ్ల కృపారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మండలంలోని మట్టగుంటలో అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిసి మాజీ ఛైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, ఎస్‌సి సెల్ మండల ఉపాధ్యక్షులు బళ్లా రాజు, ఎ.దుర్గారావు, బెనర్జీ, ఆదాము పాల్గొన్నారు.

కలిదిండిలో జరిగిన నాయీ బ్రాహ్మణ కార్తీక వన మహోత్సవ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు, నాయీ బ్రాహ్మణ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్.సదాశివం, రాష్ట్ర డైరెక్టర్లు లంకా రత్నారావు, ఎస్.నాగరాజు, రాష్ట్ర సేవా సంఘం అధికార ప్రతినిధి పి.సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తురాయి శ్రీను, నాయీ బ్రాహ్మణ నియోజకవర్గ నాయకులు రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేశారు. నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పామాయిల్ పరిశోధనా కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం క్షేత్ర పర్యటనలో భాగంగా పెదవేగి భారతీయ పామాయిల్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. కళాశాల మొదటి సెమిస్టర్ బిఎ, బికాం, బిఎస్‌సి విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు. పామాయిల్ పరిశోధన కేంద్రంలోని వివిధ విభాగాలను సందర్శించి అనేక విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రతిష్టాత్మకమైన పామాయిల్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించడం ద్వారా విద్యార్థులు ప్రేరణ పొందుతారన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ట్రిప్ ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన ఆంగ్లోపన్యాసకులు వి.వెంకటరావును అభినందించారు

సామాజిక మార్పులో జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - దెందులూరు

నిస్వార్థంగా సమాజ సేవ చేసే జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని జర్నలిస్ట్ సంఘ నాయకులతో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను ఆంధ్రప్రదేష్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియు డబ్ల్యూజే) సంఘం ఏలూరు జిల్లా నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 27వ తేదీన ఏలూరులో ఎపియుడబ్ల్యూజె ఆధ్వర్యంలో ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు చెందిన జర్నలిస్టుల కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

రాజీయే రాజమార్గం

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాజీమార్గమే రాజైన మార్గమని కైకలూరు సిఐ వి.రవికుమార్ అన్నారు. ముదినేపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 14న కైకలూరులో జరిగే మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులు కేసులు రాజీ కోసం రావాలని చెప్పారు. కైకలూరు సర్కిల్‌లో ఉన్న మండలంలోని కక్షిదారులు ఈ మెగా లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకుని తమ కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రం, సిబ్బంది, వివిధ కేసుల కక్షిధారులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఆదివాసీల సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని రైతుకూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న సున్నపురాళ్లపల్లిలో రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ అధ్యక్షతన సత్తిరాజు సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీరాంజనేయులు సత్తిరాజు స్మారక స్తూపం వద్ద జెండా ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. సత్తిరాజు మర్రిగూడెం ప్రాంతంలో రాజీలేని పోరాటం చేసి భూస్వాముల కుట్రలను తిప్పికొడుతూ వందలాది ఎకరాల భూములను ప్రజలకు పంచారన్నారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేసి, వ్యవసాయానికి రుణాలు ఇచ్చి ఆదివాసీల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. మండలాన్ని ఐటిడిఎ పరిధిలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకులు బి.రమేష్, కొండా రాము, బాబూరావు, రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.